మంచం పట్టిన సోమారం

- చికున్‌గున్యా, విషజ్వరాలతో బాధపడుతున్న గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు



గ్రామంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడ్వాయి: మండలంలోని సోమారం గ్రామం జ్వరాలతో మంచం పట్టింది. గ్రామంలో అంతుచిక్కని వ్యాధులు సోకడంతో గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. 15రోజుల నుంచి గ్రామస్తులకు పలు వ్యాధులు సోకినా అధికారులు, వైద్యులు పట్టించుకోవడం లేదు. గ్రామంలో 300లకు పైగా కుటుంబాలు ఉన్నాయి. గ్రామంలో కొంతమంది చికున్‌గున్యాతో, మరి కొంతమంది విషజ్వరాలతో బాధపడుతున్నారు. మరికొంతమందికి అంటు వ్యాధిలాంటి దురద సోకింది. గ్రామస్తులు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చూయించి నయం కావడం లేదంటు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొన్ని ఇళ్లలో నలుగురు చొప్పున పలు వ్యాధులతో మంచం పట్టారు. విషయం తెలిసిన వైద్య సిబ్బంది గ్రామంలో నామమాత్రంగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. అధికారులు, ప్రజాప్రతినిదులు స్పందించి గ్రామంలో పెద్దఎత్తున వైద్య శిబిరం నిర్వహించి గ్రామస్తులను పలు వ్యాధుల నుంచి కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జ్వరంతో బాధపడుతున్నా..



కొన్ని రోజులుగా విష జ్వరంతో బాధపడుతున్నా. ఎన్ని ఆస్పత్రుల్లో చూయించినా నయం కావడం లేదు. మా తల్లిదండ్రులకు జ్వరం వచ్చిందని వారిని చూడడానికి వస్తే నాకూ జ్వరం వచ్చింది. అంతేకాకుండా మా పిల్లలకు కూడా జ్వరం, దురద వచ్చింది. ఏం చేయాలో తోచడం లేదు.

– రజిత, గ్రామస్తురాలు

మోకాళ్ల నొప్పితో అవస్థలు



గతనెల నుంచి మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నాను. ఎంతోమంది డాక్టర్లకు చూయించినా నయం కావడం లేదు. నేలపై పాకుకుంటు పోతున్నా. మరుగుదొడ్డికి పోవాలన్నా ఇబ్బందిగా ఉంది. అధికారులు గ్రామంలో పెద్ద ఎత్తున వైద్య శిబిరం నిర్వహించి గ్రామస్తులను కాపాడాలి.

– నాగయ్య, సోమారం

అధికారులు పట్టించుకోవాలి



నేను కీళ్ల నొప్పులతో బాధపడుతున్నాను. గ్రామంలో అనేక మంది పలు రోగాన బారిన పడుతున్నారు. గ్రామాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. డ్రైనేజీల్లో ఉన్న మురికిని తొలగించి దోమలు చేరకుండా చూడాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెద్ద ఎత్తున వైద్య శిబిరం నిర్వహించాలి.

– నారాయణ, సోమారం

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మహిళ శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పాతమున్సిపల్ కార్యాలయంలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి మండల సమాఖ్య బాన్సువాడ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను శుక్రవారం ప్రారంభించారు. మహిళా సంఘాల ద్వారా మహిళలకు పావలవడ్డీ రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. బాన్సువాడలో ఇందిరా మహిళ శక్తి రెండో క్యాంటీన్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, డీఆర్డీవో సురేందర్, డీపీఎం సుధాకర్, డీఈవో రాజు, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, ఏపీఎం పద్మ తదితరులు ఉన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన



గాంధారి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శుక్రవారం జిల్లా మహిళా శిశుసంక్షేమ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగారాం, అధికారులు వీణ, మోహన్ నాయక్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



భిక్కనూర్: రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయికి ఎంపికైన జంగంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం రూపశ్రీని హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు. ఢిల్లీలో డిసెంబర్9న నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థిని పాల్గొంటుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

నస్రుల్లాబాద్: రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు నస్రుల్లాబాద్ మండల కేంద్రంలోని గురుకుల విద్యార్థులు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ మాధవరావు తెలిపారు. శుక్రవారం ఉమ్మడి జిల్లాల అండర్–14 విభాగంలో ఎంపికైన ఈశ్వర్, ఆదర్శ్ లను అభినందించారు. ఈ నెల 30 నుంచి డిసెంబర్ 2 వరకు మహబూబ్ నగర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. ఆయన వెంట వైస్ ప్రిన్సిపాల్ రాహుల్, పోశెట్టి, పీడీలు ప్రవీణ్, అశ్విన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీలకు ఎంపిక

లింగంపేట: జిల్లా స్థాయిలో నిర్వహించి చెకుముకి పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికై నట్లు ఎంఈవో షౌకత్‌అలీ తెలిపారు. గతంలో మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించి, జిల్లా స్థాయికి ఎంపికయ్యారని గురువారం నిర్వహించిన పోటీల్లో పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరికి డీఈవో రాజు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో డీఎస్‌వో సిద్ధిరామిరెడ్డి, శ్రీనివాస్, యాదాగౌడ్, ప్రవీణ్‌కుమార్, వహీద్‌సిద్ధిఖీ, శ్రీశైలం, రాజ్‌కుమార్, కృష్ణాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్

గాంధారి: మండల పరిధిలోని చిన్నపోతంగల్‌లో శుక్రవారం శ్రీకృష్ణ మందిర నిర్మాణానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు భూమి పూజ చేశారు. గ్రామంలో శ్రీకృష్ణ మందిరం నిర్మించడం అభినందనీయమని అన్నారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్: మండలంలోని మైలారంలో ఉన్న కొచ్చెరి మైసమ్మ ఆలయంలో శుక్రవారం భక్తుల సందడి నెలకొంది. భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు నీటి, వసతి సౌకర్యాలను కల్పించారు.

శబరిమాత ఆశ్రమంలో పల్లకీ సేవ

తాడ్వాయి: మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో శుక్రవారం పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శబరిమాత దివ్యసమాధి, ప్రతిమ, చిత్రపటం, పాదుకలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రాజాగౌడ్, బాపురావు, గంగారాం, సిద్ధిరాంరెడ్డి, నారాయణ రెడ్డి, రాజయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి పూజలు

కామారెడ్డి అర్బన్: జిల్లా కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో స్వామి వారికి శుక్రవారం పడిపూజ, పంచామృత, నెయ్యి, అష్టాభిషేకాలు, హారతి, అన్న ప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఎన్ శ్రీనివాస్, ప్రసాద్, రాజేందర్, కూర శ్రీనివాస్, గోనె శ్రీనివాస్, వీరమల్ల శ్రీను, నక్క శ్రీను, యాద అంజయ్య, నీల రాజు, ఎం శ్రీనివాస్, పబ్బ వేణు, ఓంప్రకాశ్, రమణ, దీక్షాపరులు పాల్గొన్నారు.

భిక్కనూరులో..

భిక్కనూరు: మండలంలోని కాచాపూర్‌లో శుక్రవారం అయ్యప్ప పడిపూజను వైభవంగా నిర్వహించారు. కత్రోజీ నవీన్ చారి, వెంకటాచారి స్వాముల నివాసంలో పడిపూజ జరిగింది. అయ్యప్ప స్వాములు ఆలపించిన భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. అనంతరం దీక్షాపరులకు భిక్ష ఏర్పాటు చేశారు.

సరస్వతి ఆలయంలో..

కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని ఇల్చిపూర్ శివారులో కొలువుదీరిన శ్రీ సరస్వతి మాత ఆలయంలో కార్తీక చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు దత్తాద్రిశర్మ, విజయపాండేల ఆధ్వర్యంలో అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. భక్తులు సాయంత్రం ఆకాశ దీపోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత పార్శి విఠల్ పటేల్, కొలాల సిద్ధాగౌడ్, రొండ్ల నారాయణరెడ్డి, మహేశ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

చుక్కాపూర్‌లో సుదర్శన హోమం

మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో శుక్రవారం స్వాతి నక్షత్రం సందర్భంగా సుదర్శన హోమం నిర్వహించారు. కామారెడ్డి, సిరిసిల్ల, నిజామాబాద్ జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

సిద్దిరామేశ్వర ఆలయంలో దీపోత్సవం



భిక్కనూర్: భిక్కనూర్‌లోని సిద్ధిరామేశ్వర ఆలయంలో శుక్రవారం దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

క్లుప్తంగా

త్రిలింగేశ్వరాలయానికి పూర్వవైభవం తీసుకువస్తాం



నాగిరెడ్డిపేట: పురాతన మహిమానిత్వ ఆలయంగా పేరొందిన మండలంలోని తాండూర్ శివారులో ఉన్న త్రిలింగేశ్వరాలయానికి పూర్వ వైభవం తీసుకొస్తామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. ఆలయంలో శుక్రవారం నిర్వహించిన రుద్రహోమంలో ఆయన పాల్గొని పూజలు చేశారు. ఆలయానికి కెమికల్‌వాష్ చేసేందుకు నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాల కాంగ్రెస్ నాయకులు రూ.7లక్షల వరకు విరాళాలు ఇచ్చేందుకు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. మండలంలోని పలుగ్రామాల్లో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.94లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు మంజూరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్, ఆలయ కమిటీ చైర్మన్ కొమ్మ దత్తు, శ్రీధర్‌గౌడ్, గంగారెడ్డి, వెంకట్రాంరెడ్డి, కుడుముల సత్యనారాయణ, శ్రీనివాస్‌రావు, ప్రభాకరచారి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



బిచ్కుంద: నిజామాబాద్‌లో సీనియర్ న్యాయవాది ఖాసీంపై ల్యాండ్ మాఫియా చేసిన దాడులకు నిరసనగా శుక్రవారం బిచ్కుంద బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు ప్రకాశ్ పటేల్, ఉపాధ్యక్షుడు మల్లేశ్వర్, బార్ సెక్రటరీ శ్రీనివాస్, న్యాయవాదులు లక్ష్మణ్‌రావు, విఠల్‌రావు, మహ్మద్, శివాజీ, పురుషోత్తం పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



కామారెడ్డి అర్బన్: కలెక్టరేట్ సబ్‌స్టేషన్‌కు రూ.80 లక్షల వ్యయంతో అదనంగా ఏర్పాటు చేసిన 5 ఎంవీఏ పవర్‌ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎస్‌ఈ ఎన్ శ్రావణ్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో టెక్నికల్ డీఈ ప్రభాకర్, ఎంఆర్‌టీ డీఈ నాగరాజు, ఏడీఈలు కిరణ్‌చైతన్య, జయరాజ్, ఏఈలు శ్రీనివాస్, హన్మంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవ కళాయాత్ర



లింగంపేట: ప్రజాపాలన విజయోత్సవాల్లో బాగంగా శుక్రవారం మండల కేంద్రంలో కళాయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భగా మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో భవానిపేట మహేందర్ కళాబృందం సభ్యులు కాంగ్రెస్ పార్టీ ఏడాదిలో చేపట్టిన సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నారాగౌడ్, బైరయ్య, రవి, ఎల్లమయ్య, సందీప్, ప్రసాద్‌గౌడ్, కళాబృందం సభ్యులు విఠల్‌రెడ్డి, నాగరాజు, ప్రశాంత్‌రెడ్డి, పోశెట్టి, కాశీరాం, సవిత, లత పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి



నాగిరెడ్డిపేట: రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని ఎల్లారెడ్డి ఏడీఏ ఎస్‌ఎన్‌వీ రత్నం సూచించారు. గోపాల్‌పేటలోని ఫర్టిలైజర్ దుకాణాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. దుకాణాల్లోని స్టాక్, రిజిష్టర్లను పరిశీలించారు. రైతులకు ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని సూచించారు. ఆమె వెంట ఏవో సాయికిరణ్ ఉన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని లక్ష్మీదేవిగార్డెన్‌లో డిసెంబర్ 1, 2 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర విద్యామహాసభలను విజయవంతం చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకట్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

రైతులకు సేవచేసే భాగ్యం రావడం అదృష్టం



పోచారం, కాసులకు జ్ఞాపికలను అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్

బాన్సువాడ: రైతులకు సేవ చేసే భాగ్యం రావడం అదృష్టంగా భావించాలని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బీర్కూర్ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారానికి ఆయన ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి హాజరయ్యారు. నస్రుల్లాబాద్, బీర్కూర్ మండలాలకు సంయుక్తంగా బీర్కూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉందని, ఒక్కో పదవీ కాలం ఒక్కో మండలానికి కేటాయిస్తూ అందరికి న్యాయం జరిగేలా చూస్తున్నామని అన్నారు. ప్రస్తుతం బీర్కూర్ ఏఎంసీ చైర్మన్‌గా శ్యామలను ఎంపిక చేసినట్లు తెలిపారు. అంతకుముందు మార్కెట్ కమిటీ చైర్మన్ శ్యామల, వైస్ చైర్మన్ యామరాములుతో పాటు డైరెక్టర్లతో మార్కెట్ కమిటీ కార్యదర్శి ప్రమాణస్వీకారం చేయించారు. బీర్కూర్‌లో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డిల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీర్కూర్, నస్రూల్లాబాద్ మండలాల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

తాడ్వాయిలో రాస్తారోకో



తాడ్వాయి: మండల కేంద్రంలో ధర్మసమాజ్ పార్టీ నాయకులు శుక్రవారం ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. పేద, మధ్యతరగతి వర్గాల వారికి విద్య, వైద్య, ఉపాధి, భూమి, ఇళ్ల సాధనకు ఈ ధర్నా కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. అనంతరం తహసీల్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అరవింద్, రాజశేఖర్, బాబుసాయికుమార్, బాబు, మోహన్, రవీందర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు ప్రశంసా పత్రాలు



లింగంపేట: తెలంగాణ గణిత ఫోరం కామారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో మండల స్థాయి మ్యాథమెటిక్స్ ట్యాలెంట్ టెస్ట్‌ను శుక్రవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించినట్లు ఎంఈవో షౌకత్‌అలీ తెలిపారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేసి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వహీద్‌సిద్ధిఖీ, నవనీత, తిరుపతిరెడ్డి, వీరేంద్రకుమార్, సరస్వతి, శైలజ, శోభారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

మిత్రురాలికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

బాన్సువాడ: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 1983–1984లో ఏడో తరగతి చదివిన విద్యార్థులు తోటి విద్యార్థిని ఆర్థికపరిస్థితి బాగ లేకపోవడంతో పూర్వ విద్యార్థులు ఆర్థికసాయం అందించారు. పూర్వ విద్యార్థిని నసీమా బేగం ఆర్థిక, ఆరోగ్య పరిస్థితి బాగా లేనందున మానవతా దృక్పథంతో తోటి పూర్వ విద్యార్థులు నసీమా కుమార్తె పేరుపై సుకన్య సమృద్ధి పేరిట రూ.20 వేలు జమ చేశారు. అంతేకాకుండా నసీమా పేరుపై రూ.20 లక్షల ఇన్సూరెన్స్ పాలసీ చేశారు. తోటి విద్యార్థులు చేసిన సాయానికి పలువురు అభినందించారు. పూర్వ విద్యార్థులు అనిల్‌కుమార్, ప్రశాంత్, శేఖర్, అబ్దుల్ రజాక్, గంగులాల్ ఉన్నారు.

ఆర్టీసీ బస్ డిపోలో వనభోజనాలు



బాన్సువాడ: ఆర్టీసీ ఎండీ ఆదేశాల మేరకు శుక్రవారం బాన్సువాడ ఆర్టీసీ బస్ డిపోలో కార్మికులకు వనభోజనాలు ఏర్పాటు చేశారు. కార్మికులకు డిపోలో ఆటపోటీలు నిర్వహించారు. గెలుపొందిన కార్మికులకు ఆర్‌ఎం శంకర్ బహుమతులు అందజేశారు. డిపో పరిధిలో పని చేస్తోన్న కార్మికులకు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డీఎం సరితాదేవి, సీఐ జన్నుబాయి, ఎంఎఫ్ కిష్టయ్య, సిబ్బంది బసంత్, కృష్ణ, జగదీశ్వర్, రాజారాం, లింగురాం తదితరులు ఉన్నారు.

క్రీడారంగంలో అమ్మాయిలను ప్రోత్సహించాలి



పెద్దకొడప్‌గల్: క్రీడా రంగంలో అమ్మాయిలను ప్రోత్సహించాలని ప్రిన్సిపాల్ సునీత పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్యారమ్స్ పలు రకాల పోటీల్లో 16 మంది అమ్మాయిలు ఎంపిక కావడం ఆనందంగా ఉందని అన్నారు. అలాగే జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు బి లావణ్య ఎంపికైందన్నారు. అనంతరం విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పీఈటీలు సుష్మా, జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



సరంపల్లిలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

కామారెడ్డి రూరల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ సిబ్బందికి సూచించారు. శుక్రవారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని సరంపల్లి శివారులో ఉన్న ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్‌ను స్థానిక కౌన్సిలర్ ఆకుల రూప రవికుమార్‌లతో కలిసి తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటగదిలోని బియ్యం, పప్పు దినుసులు, గుడ్లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కౌన్సిలర్లు పాత శివ కృష్ణామూర్తి, సుగుణ, మమత సాయిబాబా, వంశీ తదితరులు ఉన్నారు.

సీతారాంపల్లిలో..

దోమకొండ: మండలంలోని సీతారాంపల్లిలో ఉన్న కేజీబీవీని అధికారులు శుక్రవారం పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని హెచ్‌ఎం మంగమ్మకు సూచించారు. మండల ప్రత్యేక అధికారి జ్యోతి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ సంజయ్ రావు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

డాటా ఎంట్రీని త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ దశరథ్

పెద్దకొడప్‌గల్: వరి ధాన్యం డాటా ఎంట్రీని త్వరగా పూర్తిచేయాలని తహసీల్దార్ దశరథ్ సొసైటీ సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘంలోని వరి ధాన్యం ఆన్‌లైన్ డాటా ఎంట్రీని పరిశీలించారు. సొసైటి సిబ్బంది, రైతులు ఉన్నారు.

సంక్షిప్తం

సీఎం దిష్టిబొమ్మ దహనం

భిక్కనూరు: విద్యార్థుల ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా అంటూ ఏబీవీపీ జిల్లా సీనియర్ నాయకుడు గంధం సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. వసతి గృహాల్లో నాణ్యత లేని భోజనం పెడుతున్నారని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమీర్, రాజు, శివ, యోగేశ్ విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులకు రగ్గుల పంపిణీ

కామారెడ్డి అర్బన్: లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు పున్నరాజేశ్వర్ శుక్రవారం భవన నిర్మాణ కార్మికులకు శనివారం రగ్గులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కె శ్యాంగోపాల్‌రావు, ప్రతినిధులు పీవీ నర్సింహం తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ రివల్యూషన్‌కు విద్యార్థుల ఎంపిక

సదాశివనగర్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం సీజీఆర్(కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్) కార్యక్రమానికి విద్యార్థులను ఎంపిక చేసినట్లు హెచ్‌ఎం దామోదర్ రెడ్డి, పీడీ హన్మంత్‌రెడ్డి గురువారం తెలిపారు. పాఠశాలలో విద్యార్థులతో కలిపి ఎర్త్ క్లబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. యంగ్ ఎర్త్ లీడర్స్‌గా సాత్విక, అజయ్, జయశ్రీ, సమి, ఆకాంక్ష, రాంసింగ్, వర్ష, మధును ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీజీఆర్ ప్రతినిధులు శంకర్, నగేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేశాయి బీడీ కంపెనీ కార్యాలయం ముట్టడి

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఫరీదుపేటలోని దేశాయి బీడీ కంపెనీ కార్యాలయాన్ని ఆయా గ్రామాల కార్మికులు శుక్రవారం ముట్టడించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నినాదాలు చేస్తూ యాజమాన్యం, ఉద్యోగులను బయటకు వెళ్లకుండా దిగ్బంధం చేశారు. బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఎట్టకేలకు దిగివచ్చిన యాజమాన్యం నేటి నుంచి 2వేల బీడీలు తీసుకోమని, ఒప్పంద పత్రాన్ని రాసి కార్మికులకు ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు శాంతించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, సత్యం, శ్రీహరి, భాగ్యమ్మ మంజుల, రాణి, జ్యోతి లక్ష్మి, కళావతి, శ్రీలత, మమత ఉన్నారు.

గోడప్రతుల ఆవిష్కరణ

బాన్సువాడ: మాదకద్రవ్యాలపై అవగాహన, నిర్మూలనకు సంబంధించిన గోడ ప్రతులను బాన్సువాడ ఎస్‌ఆర్‌ఎన్‌కే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల స్వామి కళాశాలలో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో యాంటీ డ్రగ్స్ కమిటీ కో–ఆర్డినేటర్ రాజేశ్, అధ్యాపకులు ఉన్నారు.

నిరుపేద కుటుంబానికి జంగం సమాజం అండ

భిక్కనూరు: నిరుపేద కుటుంబానికి కామారెడ్డి జిల్లా జంగమ సమాజం అండగా నిలిచింది. మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామానికి చెందిన జంగం కాశీనాథం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో దశదిన కర్మ కోసం జంగమ సమాజం ఆధ్వర్యంలో బియ్యంతో పాటు నిత్యవసర సరుకులు అందజేసి నగదును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ప్రభాకర స్వామి, జంగం ప్రభుదేవ్, బసంత్ రాజ్, రాజశేఖర్, దత్తు రాజ్, రాజేశ్వర్, ప్రశాంత్, దిలీప్ తదితరులు ఉన్నారు.